క్లుప్తంగా

అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

భైంసాటౌన్: నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో మాదిగ, ఉపకులాలు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీకి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యావలంటీర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాప్లి రమేశ్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గడ్డం తుకారాం, నందకుమార్, బీజేపీ నాయకులు తదితరులున్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం



కమిటీ సభ్యులకు విరాళం ఇస్తున్న సుదర్శన్

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలోని మార్కండేయ ఆలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన తాళ్ల సుదర్శన్ విరాళం అందించారు. ఆదివారం రూ.51వేలను విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ అర్చకుడు నగేశ్, గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, ఇస్లాపూర్, శివుని, అప్పారావుపేట్, మలక్‌జాం ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. తులాభారం, తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దెబ్బతింటున్న ఫుట్‌పాత్.. ప్రజలకు తప్పని ఇబ్బందులు



బస్టాండ్ సమీపంలో కుంగిన టైల్స్

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలో పాదచారుల కోసం ప్రధానరోడ్డుకు ఇరువైపులా ఏడాదిన్నర కిందట నిర్మించిన ఫుట్‌పాత్ టైల్స్ భూమిలోకి కుంగిపోతున్నాయి. దీంతో ఫుట్‌పాత్‌పై నడిచే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్మల్ బస్టాండ్, రూరల్ పోలీస్‌స్టేషన్, ఆర్డీఓ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. మున్సిపల్ అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా మారిన పాదబాటను బాగు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

దత్త జయంతికి ఆలయం ముస్తాబు



దేగాంలోని సాయిబాబా ఆలయం

భైంసారూరల్: మండలంలోని దేగాం సాయిబాబా ఆలయం, వాలేగాం దత్తాత్రేయస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. మంగళవారం నిర్వహించే దత్త జయంతి ఉత్సవాలకు ఇప్పటికే ఆలయాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. ఏటా దత్తజయంతి సందర్భంగా నిర్వహించే జాతరకు వివిధ ప్రాంతాల భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్కెట్‌కెళ్తున్నారా.. జాగ్రత్త

- నిర్మల్ మార్కెట్‌లో వారానికి మూడేసి చోరీలు
- ఫోన్లు, నగదు ఎత్తుకెళ్తున్న దొంగలు
- లబోదిబోమంటున్న బాధితులు
- అనుమానితులు కన్పిస్తే సమాచారం ఇవ్వాలంటున్న పోలీసులు
- అప్రమత్తంగా ఉండాలని సూచన



నిర్మల్‌లోని కూరగాయల మార్కెట్

నిర్మల్‌టౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో దొంగల బెడద అధికమైంది. ఏయే మాత్రం ఏమరపాటుగా ఉన్నా నగదు, ఫోన్లు మాయమవుతున్నాయి. సెలవుదినం కావడంతో ప్రతీ ఆదివారం పట్టణవాసులతో మార్కెట్ ప్రాంతం కిక్కిరిసిపోతుంది. వివిధ ప్రాంతాలవారు పండ్లు, కూరగాయల కొనుగోలుతోపాటు పలు అవసరాల నిమిత్తం మార్కెట్‌కు వస్తుంటారు. ప్రజల అవసరాలను అవకాశంగా చేసుకుంటున్న దొంగలు రెచ్చిపోతున్నారు. అందినకాడికి నగదు, ఫోన్లను ఎత్తుకెళ్తున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మార్కెట్‌లో దొంగల విజృంభణ పోలీసులకు సవాలుగా మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా.. పోలీసులకు కేటుగాళ్లు దొరకడం లేదు.

ఆదివారం ఎనిమిది ఫోన్లు చోరీ

మార్కెట్‌కు వచ్చే సామాన్యుల ఫోన్లు, నగదు అధికంగా చోరీకి గురవుతున్నాయి. ఈనెల 24న ఆదివారం ఉదయం మార్కెట్‌కు వచ్చిన మంజులపూర్ కౌన్సిలర్ పురస్తు చిన్నయ్యతోపాటు, మరో ఏడుగురి ఫోన్లు అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులకు దొరకని కేటుగాళ్లు..

పట్టణంలోని మార్కెట్‌లో వారానికి సుమారు మూడు, నాలుగు ఫోన్లు లేదా నగదు పోయిందని పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులు వస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. దీంతో కొందరు మార్కెట్‌కు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఫిర్యాదులు పెరుగుతున్నా.. దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. ఇటీవల మార్కెట్‌పై నజర్ పెట్టి అనుమానితులను ప్రశ్నించినా దొంగల ఆచూకీ దొరకలేదు. కానీ జిల్లాలో పోగొట్టుకున్న 358 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మార్కెట్‌కు వెళ్లినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అనుమానితులుంటే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఫోన్ ఎత్తుకెళ్లారు



ఆదివారం ఉదయం మార్కెట్లోకి కూరగాయలు తీసుకునేందుకు వచ్చా. కూరగాయలు ఏరుతుండగా రూ.50వేల విలువైన ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. దొంగల బెడద అధికమైంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రెండేళ్ల కిందట కూడా నా రూ.25 వేల ఫోన్ పోయింది. పోలీసులు మార్కెట్‌పై నిఘా పెంచి దొంగలను పట్టుకోవాలి.

– పురస్తు చిన్నయ్య, 18వ వార్డు కౌన్సిలర్

దొంగలను పట్టుకుంటాం



మార్కెట్‌లో దొంగతనం జరిగినట్లు ఫిర్యాదులొస్తున్నాయి. రోజు గస్తీలో సిబ్బందిని ఉంచి రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తాం. మార్కెట్‌కి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండడం మంచిది. అనుమానితులు కనబడితే పోలీసులకు సమాచారమివ్వాలి. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. సీఈఐఆర్ సాయంతో ఫోన్లని పట్టుకొని బాధితులకు అందిస్తున్నాం.

– గంగారెడ్డి, నిర్మల్ డీఎస్పీ

కనుల పండువగా అయ్యప్ప పూడిపూజ



అభిషేకం చేస్తున్న సుమన్‌బాయి, రాథోడ్ రమేశ్



ఖనాపూర్‌లో పడిపూజకు హాజరైన భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే సుమన్‌బాయి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాపడిపూజ వైభవోపేతంగా జరిగింది. గురుస్వామి శనిగారపు చిన్నయ్య, పిసుపాటి పాపారావు, పండితులు నర్ర నితీశ్, విజయ్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. కర్పూర హారతులు, మెట్ల పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ కళా సాంస్కృతిక బృందం ఆధ్వర్యంలో గీతాలపన, భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. పడిపూజకు హాజరైన ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్‌తో పాటు ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, జిల్లా నాయకులు రావుల రాంనాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్, తదితరులను మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న తదితరులు ఉన్నారు.

బెల్‌తరోడాలో..



బెల్‌తరోడాలో అభిషేకం చేస్తున్న భక్తులు

తానూరు: మండలంలోని బెల్‌తరోడాలో క్రేషర్ సమీపంలో ఆదివారం ఆష్టాకు చెందిన గురుస్వామి సునీల్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తానూరు, ముథోల్, ధర్మాబాద్, భైంసా మండలాలకు చెందిన దీక్షాపరులు తరలివచ్చారు. గణపతి, సుబ్రమణ్యం స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం చేశారు. నిర్మల్‌రాయి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు పోశెట్టి, చిన్నన్న, కృష్ణ, సంతోష్, సిద్దు, పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



సోన్ : మాధవపూర్‌లో పాస్టర్ సందేశం

సోన్: మండలంలోని మాధపూర్‌లో ఉన్న బేతేలు చర్చిలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ చంటి, ఇశ్రాయిల్ రాజు ఆధ్వర్యంలో క్రీస్తు సందేశం వివరించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలవ్యాప్తంగా చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి. సోమవారం మండల కేంద్రంలోని మూడు చర్చిల్లో.. రాచాపూర్, నర్సాపూర్ గ్రామాల్లోని చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

27న మండల పడిపూజ

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఈనెల 27న గురుస్వామి, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో మహా మండల పడిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భద్రాచలం చండీ ఉపాసకులు ప్రదీప్‌శర్మతోపాటు గురుస్వామి పా పారావు, పండితులు నితీశ్, విజయాచార్యుల ఆధ్వర్యంలో పడిపూజ ఉంటుందన్నారు. భద్రాచలం గణేశ్‌గురుస్వామి భజన మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక, గీతాలపన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు తరలి రావాలని కోరారు.

ఈ-కేవైసీ దందా

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకుంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కు రాయితీ సిలిండర్ ఇస్తుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో మహిళలు పిల్లపాపలతో జిల్లా కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈ-కేవైసీ నమోదు కోసం బారులు తీరుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకంపై మార్గదర్శకాలు రూపొందించలేదని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ఏజెన్సీలకే ఈ-కేవైసీ చేసే అవకాశం ఉంది. ఇదే అదనుగా భావించిన ఏజెన్సీదారులు రూ.200 చెల్లించి గ్యాస్‌పైపు తీసుకుంటేనే వినియోగదారుల ఈ కేవైసీ నమోదు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈకేవైసీ నమోదు కోసం క్యూకట్టిన మహిళలు



గ్యాస్‌పైప్ తీసుకుంటేనే ఈకేవైసీ చేస్తామంటున్న హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకుడు



వేలిముద్రలు తీసుకుంటున్న నిర్వాహకులు



అనవసరంగా గ్యాస్‌పైపు అంటగట్టారంటున్న మహిళలు

జనవరి 1న అయోధ్య అక్షింతలు పంపిణీ



మాట్లాడుతున్న కొత్తకాపు నారాయణ

కుంటాల: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను జనవరి 1న ఇంటింటికీ పంపిణీ చేస్తామని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు కొత్తకాపు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం కుంటాలలో శ్రీ రామకృష్ణ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 26న శ్రీ వీర హనుమాన్ ఆలయంలో అయోధ్య అక్షింతలు భద్రపరిచి, శ్రీరామ విజయ మహా మంత్రం108 సార్లు, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తామని పేర్కొన్నారు. మహిళలు మంగళహారతులతో, భజన భక్తులు, గ్రామస్తులు అక్షింతల ఊరేగింపులో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జక్కుల గజేందర్, సుద్దపు ముత్యం, పల్సి గజ్జారాం, గజేందర్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

గోదారంగనాథస్వామి జన్మోత్సవం



ఊయల సేవలో మార్వాడీలు

భైంసాటౌన్: ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని రాధాకృష్ణ భవన్‌లో మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోదాదేవిరంగనాథ స్వామి జన్మోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను గోదాదేవి,రంగనాథ స్వామి వేషధారణలో అలంకరించి ఊయల సేవ నిర్వహించారు. భజన, పూజాది కార్యక్రమాలు జరిపించారు. అలాగే గోదారంగనాథుల జన్మోత్సవం ప్రాముఖ్యతను వివరించేలా క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్వాడీ సంఘ మహిళలు పాల్గొన్నారు.

బాబా మందిరంలో యాగం ప్రారంభం



యజ్ఞం ప్రారంభిస్తున్న వేద పండితులు

కుంటాల: మండలంలోని కల్లూర్ శ్రీదత్త వెంకటసాయి బాబా ఆలయంలో ఆదివారం శ్రీ మహా సుదర్శన యాగం ప్రారంభించారు. శ్రీ దత్త జయంతి ఉత్సవాల సందర్భంగా ఉదయం శ్రీ విఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, శ్రీ దత్తాత్రేయ స్వామి అభిషేకాలు, అగ్నిప్రతిష్ఠ మహాత్ముల దివ్య ప్రవచనాలు, మహాయాగం, అఖండ సాయి నామ సప్తహం, సప్తాహం పారాయణం సమాప్తి, మహాత్ముల దివ్య ప్రవచనాలు సాయంత్రం ప్రదోషకాల పూజలు, నీరాజనం మంత్రపుష్పం తదితర పూజాది కార్యక్రమాలు బబ్రు మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ దత్తగడ్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి



గిఫ్ట్‌ప్యాక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

- ఖనాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- క్రైస్తవులకు గిఫ్ట్‌ప్యాక్‌ల పంపిణీ

ఖానాపూర్: కుల, మతాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో ఉన్న మిరాకల్ చర్చిలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల పాస్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో వెయ్యి మంది పేదలకు గిఫ్ట్‌ప్యాక్‌లతోపాటు పారితోషికం అందజేస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవుల శ్మశానవాటికల నిర్మాణానికి కృషి చేయడంతో పాటు పాస్టర్లకు గౌరవవేతనం అందిస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా పలువురు పేదలకు గిఫ్ట్‌ప్యాక్‌లు, స్వీట్లు అందించి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు నాయకులను పాస్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోషియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు డానియెల్, ఖానాపూర్ డివిజన్ పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పాస్టర్ కె.ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షులు శామ్యూల్, ప్రధాన కార్యదర్శి ఎల్.రాజబాబు, కోశాధికారి జేసుదాస్, కార్యవర్గ సభ్యులు బాగ్య శేఖర్, జాషువా, నాయకులు చెప్యాల అనురాధ, దయానంద్, జంగిలి శంకర్, రాజునాయక్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, స్వప్నిల్‌రెడ్డి, తోట సత్యం, మామిడాల శ్రీను, నిట్ట రవి, రాజు, జహీర్, సంతోష్, నబీ, అశోక్, తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూళ్ల సమస్యలపై వినతి

ఖానాపూర్: మోడల్ స్కూళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి అన్ని మండలాల్లో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ప్రోగేసివ్ మోడల్ స్కూల్స్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.శివకృష్ణ కోరారు. ఆదివారం రాత్రి ఖానాపూర్ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే బొజ్జును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రెండో విడతలో మంజూరైన 125 మోడల్ స్కూళ్ల ఏర్పాటు పూర్తి చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 2012లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఇంగ్లిష్ మీడియంలో మోడల్ స్కూళ్లను ప్రారంభించిందన్నారు. ఉమ్మడి జిల్లాకు 14 మాత్రమే వచ్చాయని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వంలో పునఃప్రారంభించాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్.. పడిపోతేనే పట్టించుకుంటారా.?



లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామం నుంచి నర్సాపూర్, బాబాపూర్ గ్రామాలకు వెళ్లే సరస్వతి కాలువ ఒడ్డున విద్యుత్ స్తంభం వంగి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది, విద్యుత్ తీగలు చేతికి అందేలా ప్రమాదకరంగా మారాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మహేశ్, విద్యుత్ ఏఈ, ఫోన్ : 94408 11706

నేడు, రేపు కొనుగోళ్లు బంద్

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ యార్డులో నేడు, రేపు పంట ఉత్పత్తుల కొనుగోళ్లను నిలిపేయనున్నట్లు మార్కెట్ అధికారులు ప్రకటనలో తెలిపారు. సోమవారం క్రిస్మస్, మంగళవారం బాక్సింగ్ డే సందర్భంగా యార్డులో భూసార్ బీట్ బంద్ ఉంచినట్లు పేర్కొన్నారు.